క్లుప్తంగా

ఉచితంగా 'ఉజ్వల'ను పొందండి

పెద్దేముల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉజ్వల ఉచిత వంట గ్యాస్‌ను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సందీప్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధి మంబాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రధాని అయ్యాక పేదకు ఉచిత బియ్యంతో పాటు పలు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. కేంద్ర పథకాలు తమవంటూ గత ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ.. ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, రేషన్‌కార్డును జత పరిచి గ్యాస్ ఏజెన్సీ వద్ద దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా గ్యాస్ అందుతుందని పేర్కొన్నారు. అనంతరం కేంద్ర పథకాల గురించి వివరించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ ప్రవీణ్, సిబ్బంది, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రదీప్, జిల్లా బీజేవైఎం కార్యదర్శి రమేష్ సాగర్, ఇండియన్ గ్యాస్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డుతో ఉచిత బీమా


శిక్షణలో ట్రైనీ కిట్స్‌ను పంపిణీ చేస్తున్న కోఆర్డినేటర్

పరిగి: భవన నిర్మాణ కార్మికులు ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి జన్ సాహస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్ సూచించారు. పట్టణ కేంద్రంలో మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో న్యాక్ వారిచే 15 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. లేబర్ కార్డు కలిగిన కార్మికులు ఈ శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.300 ఇవ్వడంతో పాటు, మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు వెల్లడించారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ లేబర్ కార్డును తీసుకోవాలని, దీని ద్వారా ఉచితంగా బీమా సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనర్లు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

వికారాబాద్ ఎంపీపీ చంద్రకళ

అనంతగిరి: సమస్యల పరిష్కారంలో ప్రాధాన్యతను బట్టి, వెంటనే పరిష్కరించాలని వికారాబాద్ ఎంపీపీ చంద్రకళ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రవీంద్ర మంటపంలో జరిగిన వికారాబాద్ మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజా సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులకు అందేలా కృషి చేయాలని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలని సూచించారు. ప్రజాపాలనలో అర్హులు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించి, లబ్ధిపొందేలా చూడాలన్నారు. ఈ విషయంలో అధికారులు ప్రణాళికబద్ధంగా ఉండాలన్నారు. మండల అభివృద్ధికి తాను ఎల్లవేళలా పాటుపడుతానని పేర్కొన్నారు. ఎంపీడీఓ సత్తయ్య, డీఈలు శ్రీనివాస్, రత్నప్రసాద్, ఎంపీఓ నాగరాజు, ఎంఈఓ బాబుసింగ్, దల సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, ఎంపీటీసీ గౌసొద్దీన్, అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులకు సమ్మె ఎఫెక్ట్!

ఇంధనం కోసం బారులు తీరిన వాహనదారులు


పెట్రోల్ బంకులో కిక్కిరిసిన వాహనాలు

ధారూరు/తాండూరు: పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెబాట పట్టనున్నారని, డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన విరమించేది లేదన్న వార్తలతో మంగళవారం పెట్రోల్ బంకులు వాహనదారులతో కిక్కిరిసిపోయాయి. ఇంధనం దొరకదన్న పుకార్లతో గంటల కొద్దీ నిరీక్షించారు. ఇలా ఒక్కసారిగా వాహనదారులు బంకుకు వస్తున్న నేపథ్యంలో నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. క్యూలో ఉన్నవారికి చమురు పోస్తున్నప్పటికీ.. కొందరు బాటిళ్లలో పోయాలని కోరగా.. నిరాకరించారు. ఇలా ఒకేసారి బంక్‌కు వాహనాలు రావడంతో.. పరిసరప్రాంతాల్లో ట్రాఫిక్ జాం అయింది.


తాండూరు: బాటిళ్లతో వాహనదారులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


తాండూరు రూరల్: ఓగిపూర్ ప్రజాపాలనలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి

ఆరు గ్యారంటీల అమలుకే ప్రజాపాలన

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు
- ప్రజాపాలనకు వెల్లువెత్తిన దరఖాస్తులు

మర్పల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకే అభయహస్తం చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, జిల్లా నాయకులు ఖలీమోద్దీన్‌లు తెలిపారు. మంగళవారం మండలంలోని బూచన్‌పల్లి, దామస్తాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ గణేశ్ తమ సిబ్బందితో ప్రజాపాలన నిర్వహించారు. రెండు రోజుల విరామం అనంతరం ప్రారంభం కావడంతో ప్రజలు భారీగా అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో పేదలు ఇబ్బంది పడ్డారని, కాంగ్రెస్ హయాంలో అలా జరగకూడదనే ఉద్దేశంతో గ్యారంటీలు అమలు చేసేందుకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తోందని తెలిపారు. అర్హులందరికీ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. సర్పంచ్ జయ, పార్టీ నాయకులు సుభాష్‌యాదవ్, శేఖర్‌యాదవ్, పాండురంగారెడ్డి, సురేష్, అశోక్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, పాండునాయక్, అబ్రహాం, ఉప సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రామ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బలవంత్‌రెడ్డి, రాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి అధికారులు ఆర్‌ఐ మాధవరెడ్డి, ఏపీఎం మధుకర్, ఏఈఓ నీరజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి..

పెద్దేముల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి లలితకుమారి కోరారు. మండల పరిధి బండపల్లి, గోపాల్‌పూర్, నాగులపల్లి, మారేపల్లి గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమాలను ఆమె సందర్శించారు. ఉద్యమ కారుడు కేశవులు గ్రామసభలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడారు. అభయహస్తానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, అర్హులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఏఓ నజీరొద్దీన్, విద్యుత్ ఏఈ సందీప్ కుమార్, ఏఈఓ బాలయ్య, పీఓ నర్సింహులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణి, పంచాయతీ కార్యదర్శులు రమేష్, అర్చన, ఉపాధిహామీ, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం లలితకుమారి వైద్య సిబ్బందితో బీపీ చెక్ చేయించుకున్నారు.

మండలంలో 8,100 దరఖాస్తులు

తాండూరు రూరల్: ప్రజాపాలనలో ఇప్పటి వరకు మండల పరిధి గ్రామాల 8,100 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓగిపూర్ గ్రామ సభను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన చేపట్టిందని పేర్కొన్నారు. అత్యధికంగా కరన్‌కోట్‌లో 1,847, ఓగిపూర్‌లో 325 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. జెడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ వసంత్, నాయకులు వెంకటేశం, విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకే ప్రజాపాలన

కొడంగల్ రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. మండల పరిధి రావులపల్లి, అన్నారం, టేకుల్‌కోడ్, లక్ష్మీపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల అమలు ప్రభుత్వం ప్రజాపాలన నిర్వహిస్తోందని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దార్ విజయకుమార్, ఎంపీడీఓ పాండు, ఎంపీఓ శ్రీనివాస్, సర్పంచులు రమేష్‌రెడ్డి, గోవిందు, అనిత, భీమమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుటుంబాలకంటే.. దరఖాస్తులు ఎక్కువ

ధారూరు: గ్రామసభలకు ఆరఖాస్తులు విరివిగా వస్తున్నాయి. కుటుంబాలు తక్కువగా ఉన్నా.. అర్జీలు ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. ధారూరు మండలం నాగారం, పీసీఎంతండా, అల్లిపూర్, కేరెళ్లి మంగళవారం నాటి సభల్లో 1,847 కుటుంబాలకు నుంచి.. 2,322 దరఖాస్తులు అందాయి. డిసెంబర్ 28 నుంచి ఇప్పటి వరకు 16 జీపీల పరిధి 5,927 కుటుంబాల నుంచి.. 6,350 అర్జీలు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి తెలిపారు. మండల ప్రత్యేక అధికారి మల్లేశం, సర్పంచులు నర్సింహారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

దోమ: ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అని ఎంపీపీ అనసూయ అన్నారు. మండల పరిధి ఐనాపూర్, లింగన్‌పల్లి, గొడుగోనిపల్లి, దోర్నాల్‌పల్లి, బట్లచందారం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిగా పాల్గొని సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీడీఓ జయరాం, ఆర్‌ఐ సుదర్శన్, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు, సర్పంచులు బల్లరాణి, గార్లపల్లి మల్లన్న, అమృతమ్మ, రాములు, యాదయ్య సాగర్, ఎంపీటీసీలు విజయ, ఉపసర్పంచ్ బుగ్గయ్య, జీపీ కార్యదర్శులు హరిశ్వర్‌రెడ్డి, వార్డు సభ్యులు మల్లన్న, బాబు, గ్రామస్తులు ఆంజనేయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా..

బంట్వారం: ప్రజాపాలనకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. బంట్వారం, కోట్‌పల్లి మండల పరిధి గ్రామాల్లో అధికారులు ఆరు గ్యారంటీలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు.

గతంలో గృహలక్ష్మి.. ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు


ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

దౌల్తాబాద్: సొంతింటి కల నెరవేర్చుకోవడానికి నిరుపేదలు ఆరాటపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తొలుత డబుల్ బెడ్‌రూం, గృహలక్ష్మి కోసం అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ అవి నెరవేరలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా పేర్కొన్న ఇందిరమ్మ ఇంటికోసం.. నిర్వహిస్తున్న ప్రజాపాలనలో అర్జీలు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. దౌల్తాబాద్‌లో నిర్వహించిన అభయ హస్తం కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తన సిబ్బందితో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ఊరించి.. నిరాశ పరిచి..

బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చివరకు ఆదీ ఎన్నికల ముందు గ్రామానికి 25 ఇండ్లు మంజూరయ్యాయని ఊరించింది. కానీ ఎన్నికల కోడ్ పడిందంటూ దాటవేసి, అర్హులను నిరాశ పరిచింది. ప్రస్తుత ప్రభుత్వం.. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరిట దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. ఈ సారైనా తమకు ఓ గూడు వరిస్తుందో లేదోనని నిరుపేదల ఆశగా ఎదురు చూస్తున్నారు.

ముందు రేషన్ కార్డులివ్వండి..

- కౌన్సిలర్ నంగీతాఠాకూర్


అర్జీలు స్వీకరిస్తున్న కౌన్సిలర్, కమిషనర్

తాండూరు టౌన్: అర్హులందరికీ తొలుత తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని 20వ వార్డు కౌన్సిలర్ సంగీతాఠాకూర్ డిమాండ్ చేశారు. స్థానికంగా నిర్వహించిన ప్రజాపాలనలో మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లాతో కలిసి ఆమె దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. గ్యారంటీ పథకాల కోసం అర్జీ పెట్టుకునేందుకు ఆధార్‌కార్డుతో పాటు, రేషన్ కార్డు జిరాక్స్ నకలు పెట్టాలని ఉందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం రేషన్ కార్డు జిరాక్సు జత చేయక పోయినప్పటికీ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వెల్లడించారు. కానీ గ్యారంటీలు తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికే దక్కుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని, అవి ఇవ్వకుండా అర్జీలు స్వీకరిస్తే లాభం ఏముంటదని ప్రశ్నించారు. ముందుగా రేషన్ కార్డుల కోసం ప్రత్యేక దరఖాస్తు ఫారం ఇవ్వాలని, అనంతరం తెల్ల రేషన్‌కార్డులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


పెద్దేముల్: బండపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


కొడంగల్ రూరల్: రావులపల్లిలో దరఖాస్తులను తీసుకుంటున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్


మర్పల్లి: దామస్తాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ గణేశ్


ధారూరు: కేరెళ్లిలో అర్జీల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి మల్లేశం

కరుణించు మాత


ప్రత్యేక అలంకరణలో భవానీ

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్ భవానీనగర్‌లో వెలసిన అంబాభవానీ మాత.. మంగళవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు పీఠాధిపతి, తెలంగాణ సాధూపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ స్వామిజీ ప్రవచనాలు వినిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

అయోధ్య అక్షింతల వితరణ


తాండూరు టౌన్: అక్షింతలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

తాండూరు టౌన్: అయోధ్య రామ మందిర అక్షింతలను వాల్మీకినగర్ శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ, మహిళా మండలి, వార్డు కౌన్సిలర్ అంతారం లలిత ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. బాలరాముని పూజించిన అక్షింతలతో పాటు స్వామి వారి ఫొటో, కరపత్రాన్ని అందజేశారు. అయోధ్యలో ఈ నెల 22న రాముడిని ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో అక్షింతలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: అయోధ్య నుంచి వచ్చిన రాములవారి అక్షింతలను హనుమాన్, బలభీమసేన ఆలయం నుంచి పరిసరప్రాంత గ్రామాల్లోని ఇంటింటికీ పంపిణీ చేశారు. 22న సాయంత్రం ప్రతి ఇంటిలో దీపం వెలిగించాలని ప్రజలకు రామ భక్తులు సూచించారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య

షాబాద్: సర్కారు బడుల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మండల నోడల్ అధికారి లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధి సర్దార్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని, ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. సర్పంచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనపై ఆందోళన వద్దు


ప్రజాపాలనను పరిశీలిస్తున్న కలెక్టర్

- అధికారుల నిర్వహణ భేష్
- కలెక్టర్ నారాయణరెడ్డి

బొంరాస్‌పేట: ప్రభుత్వం గ్యారంటీ పథకాల అమలుపై చేపట్టిన ప్రజాపాలనకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని లింగన్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలనను ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు పూటల కార్యక్రమం ఉంటుందని, ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు.

దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్లు

ప్రజాపాలన గ్రామసభల్లో ఐదు గ్యారంటీల దరఖాస్తులతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామసభలో గ్రామానికి చెందిన ఓ మహిళ అడిగిన ప్రశ్నకు కలెక్టర్ బదులిచ్చారు. భూమిపట్టా, రేషన్ కార్డులు, ఆధార్‌కార్డులు తదితర సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ప్రత్యేక కౌంటర్‌లో తెలియజేయవచ్చన్నారు.

6 తర్వాత జిల్లాలో..

ప్రజాపాలనలో దరఖాస్తులు సమర్పించలేక మిగిలినపోయినవారు ఈనెల 7నుంచి నేరుగా జిల్లా కేంద్రంలోనూ సమర్పించవచ్చనిచెప్పారు. ఇది నిరంతర ప్రక్రియని పేర్కొన్నారు. సర్పంచు కాశప్ప గ్రామపంచాయతీకి వీఆర్‌ఏ, ఎఫ్‌ఏలు లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయని, నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరాడు. దీనిపై పరిశీలించి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రత్యేక అధికారి పీకే శ్రీదేవి, డీఆర్‌డీఓ కృష్ణన్, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, టీమ్ సభ్యులు ఏపీఓ, ఏఈఓ, తదితరులున్నారు. అలాగే, మండలంలోని బొట్లోనితండా, మహంతీపూర్, దుప్‌చర్ల, దుద్యాల మండలంలోని ఈర్లపల్లి, సత్తర్‌కుంటతండాలో ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి.

'తెల్ల'బోయిన రైతన్న

- క్వింటా పత్తికి రూ.100 తగ్గిస్తూ సీసీఐ నిర్ణయం
- గిట్టుబాటు కావడం లేదంటూ ఆందోళన
- కొనుగోళ్లకు వరుస విరామంతో కలత


మోమిన్‌పేట అయ్యప్ప కాటన్ మిల్లు ప్రాంగణంలో పత్తిలోడుతో వాహనాలు

మోమిన్‌పేట: వరుసగా రెండు రోజులు ప్రభుత్వ సెలవులు, సీసీఐ విజ్ఞప్తి మేరకు మరో రెండు రోజులు కొనుగోలుకు విరామం ఇచ్చారు. దీంతో వరుసగా నాలుగు రోజులు సెలవులు ఉండటంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. కాగా.. జనవరి నుంచి రెండోసారి పత్తితీత ఉంటుందని చెబుతూ.. క్వింటా పత్తికి రూ.100లు ధర తగ్గిస్తూ సీసీఐ నిర్ణయించింది. దీంతో రైతులు ఆందోన చెందుతున్నారు. ఇప్పటికే దిగుబడులు తగ్గడం, దానికి తోడు ధర తగ్గించడంతో తలలు పట్టుకున్నారు. ఇంకా కొందరి వద్ద పత్తి నిలువలు ఉన్నాయని, కేవలం సీసీఐకి ఇప్పటి వరకు 903మంది మాత్రమే దిగుబడిని తీసుకువచ్చారని రైతులు పేర్కొన్నారు. పత్తితీత ముగిసిన తరువాత ధరలు పెరుగుతాయనే చాలా మంది ఇంట్లో నిలువ చేసుకున్నారని, కానీ ఇలా ఉన్నట్టుండి ధర తగ్గిస్తే ఎలా అని రైతులు వాపోతున్నారు.

తగ్గిన దిగుబడి..

మండల పరిధి గ్రామాల్లోని సుమారు 80శాతం భూముల్లో రైతులు పత్తిని సాగుచేశారు. అయితే వాతావరణం అనుకూలించక పోవడంతో ఎకరాకు 6 క్వింటాళ్ల మేర మాత్రమే వచ్చిందని తెలిపారు. దిగుబడి తగ్గింది, కానీ ఖర్చు పెరిగిందని, ప్రస్తుతం ఇలా రేట్లు దగ్గించడం తమకు నష్టమే అవుతుందని ఆందోళన చెందుతున్నారు. పత్తి తీతకే కిలోకు రూ.15ల నుంచి రూ.18లు వెచ్చించామని రైతులు పేర్కొంటున్నారు.

వచ్చిన ధరే దిక్కు

పెట్టుబడి పెరగడం వలన ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020. కానీ పత్తి తీత చివరి దశ ఉందని పేర్కొంటూ క్వింటాకు రూ.100 సీసీఐ తగ్గించింది. బహిరంగ మార్కెట్‌లో డిమాండు లేకపోవడంతో వచ్చిన ధరే దిక్కంటూ సీసీఐకే రైతులు మొగ్గుచూపుతున్నటికీ.. ప్రస్తుత ధర ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని విచారం వ్యక్తంచేస్తున్నారు. కాగా.. మోమిన్‌పేట అయ్యప్ప కాటన్ మిల్లులో గత నవంబరు 23వ తేదీ నుంచి ఇప్పటి వరకు 903మంది రైతుల నుంచి 26,026 క్వింటాళ్ల పత్తిని సీసీఐ సేకరించిందని మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

5 నుంచి ఎల్లమ్మ జాతర

- మూడురోజులు కొనసాగనున్న వేడుకలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ


విశేష అలంకరణలో ఎల్లమ్మ తల్లి

యాలాల: ముద్దాయిపేట రేణుక ఎల్లమ్మ జాతర ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 5 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఆలయ కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా రంగుల రాట్నం, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ రైలు లాంటి వినోద పరికరాలు అమర్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. యేటా నిర్వహించే విధంగానే కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఏరోజు.. ఏ కార్యక్రమం

వేడుకలు శుక్రవారం నుంచి మొదలు కానున్నప్పటికీ.. తొలుత గురువారం గ్రామంలోని ప్రధాన వీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకం, సాయంత్రం సిడే ఊరేగింపు, రాత్రి 8 గంటలకు లొంక హనుమాన్ మందిర్, కాలాపూర్ భజన మండల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఉంటుంది. 6న చుక్కబోనాలు, సిరిగిరిపేట్ గ్రామస్తుల భజన, 7న రథోత్సవం, సాయంత్రం సంగాయగుట్టతండా, తొప్పెర్లగడ్డ తండాలకు చెందిన గిరిజన మహిళల ప్రత్యేక కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నాయని ఆలయ శాశ్వత ధర్మకర్త, ఎంపీటీసీ దేవగారి రాములు, సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, ఉప సర్పంచ్ చాకలి లక్ష్మి, మాజీ సర్పంచ్‌లు విఠలయ్య, బిచ్చన్నగౌడ్‌లు తెలిపారు.


జాతర పరిసరాల్లో ఏర్పాటైన వినోద పరికరాలు

ఆకట్టుకుంటున్న ముఖ ద్వారం

ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసిన ముఖద్వారం ఆకట్టుకుంటోంది. ద్వారంపై ఏర్పాటు చేసిన ఎల్లమ్మ తల్లి విగ్రహంతో పాటు తదితర దేవతామూర్తులను నెలకొల్పడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి తోడుగా కమాన్‌కు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల వాహనాలకు పార్కింగ్ స్థలం, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

సంక్షేమ పథకాలపై అవగాహన


కుల్కచర్ల: ప్రధాని సందేశం వింటున్న ప్రజలు

కుల్కచర్ల: కేంద్రం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య, టీజీబీ బ్యాంక్ మేనేజర్ సతీష్ సూచించారు. మంగళవారం చౌడాపూర్ మండల పరిధి వీరాపూర్, ముక్తవెంకటాపూర్ గ్రామాల్లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరుపేదల అభ్యున్నతికి అనేక పథకాలను కేంద్రం అమలు చేస్తోందని, అవగాహన లేని కారణంగా ప్రజలు సద్వినియోగం చేసుకోవడం లేదని తెలిపారు. అందుకే వికసిత్ కార్యక్రమం ద్వారా పథకాల గురించి వివరిస్తున్నామని వెల్లడించారు. వీరాపూర్ సర్పంచ్ జనార్దన్ రెడ్డి, ముక్తవెంకటాపూర్ వెంకట్, హెల్త్ విజిటర్ రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీమాను వినియోగించుకోండి..

కొడంగల్ రూరల్: పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ప్రవేశపెట్టిన బీమా ప్రయోజనాలను వినియోగించుకోవాలని యూనియన్ బ్యాంకు అధికారులు సూచించారు. కొడంగల్ మండలం అంగడిరాయిచూర్‌లో డిజిటల్ స్క్రీన్‌పై కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. కేంద్రం అమలు చేస్తున్న బీమా సౌకర్యంతో పాటు వృద్ధాప్యంలో ఎవరిపై ఆధారపడకుండా పింఛన్ అందించే ప్రయోజనాల గురించి తెరపై చూపించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఉన్న అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.